## క్లుప్తంగా

### నేడు ఇంటింటా దీపాలు వెలిగించాలి



మాట్లాడుతున్న రామ జన్మభూమి తీర్థక్షేత్ర సభ్యులు

మిరుదొడ్డి(దుబ్బాక): అయోధ్యలోని శ్రీ రామ జన్మభూమి భవ్య మందిరంలో సోమవారం జరిగే రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవం సందర్భంగా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో భక్తులు ఇంటింటా ఐదు దీపాలు వెలిగించాలని రామ జన్మభూమి తీర్థక్షేత్రం మండల ఇన్‌చార్జి కానుగంటి శ్రీనివాస్, సీతామచంద్ర స్వామి ఆలయ అర్చకులు రాజగోపాల చారి కోరారు. మిరుదొడ్డిలోని రామాలయ కల్యాణ మండపంలో ఆదివారం వారు మాట్లాడారు. మిరుదొడ్డిలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, స్వామి వారి శోభాయాత్ర నిర్వహించడంతో పాటు భక్తులకు తీర్థ ప్రసాద వితరణ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రామ జన్మభూమి తీర్థ క్షేత్ర మండల బాధ్యులు తుమ్మల నర్సింలు, రాందేవ్ జ్ఞానేశ్వర్, గొట్టం రవి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

### ఆహ్వానం



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని వంగరామయ్యపల్లి పంచాయతీ భవన ప్రారంభానికి రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను శనివారం బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి కలిసి ఆహ్వానించారు. నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీకి భవన నిర్మాణం పూర్తి దశకు వచ్చిందని.. సర్పంచ్‌ల పదవీ కాలం ముగింపు దశకు రావడంతో భవన ప్రారంభానికి రావాలని కోరినట్లు చెప్పారు. ఆయన వెంట సింగిల్ విండో డైరెక్టర్ తిరుపతినాయక్ ఉన్నారు.

### ముగిసిన యువజన క్రీడోత్సవాలు



క్రీడాకారులతో ఏబీవీపీ నాయకులు

హుస్నాబాద్: స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన నగర స్థాయి యువజన క్రీడోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వాలీబాల్, క్రికెట్ పోటీల్లో గెలిచిన విజేతలను ప్రకటించారు. ఈసందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సావుల ఆదిత్య మాట్లాడుతూ.. వివేకానంద, సుభాష్ చంద్రబోస్‌లను ఆదర్శంగా తీసుకొని వారి బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రాకేష్, చరణ్, రాహుల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

హుస్నాబాద్: ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లతో సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరించాలని డీటీఎఫ్ రాష్ట్ర మాజీ ఉద్యక్షుడు కవ్వ లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. హుస్నాబాద్‌లో సోమవారం క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల బిల్లులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో స్వార్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్, డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వెంకటరమణారెడ్డి, నాయకులు సంపత్, ప్రభాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### లెనిన్‌కు నివాళి

చేర్యాల(సిద్దిపేట): మానవాళి వినాశనానికి దారితీసే సామ్రాజ్యవాద విధానం నశించాలని సీపీఎం మండల కార్యదర్శి కొంగరి వెంకట్ మావో అన్నారు. ఆదివారం లెనిన్ వర్ధంతిని స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్, శ్రీనివాస్, శ్రీహరి, ప్రభాకర్, నర్సిరెడ్డి, రంజిత్‌రెడ్డి, నర్సింహులు, చందు, ప్రవీణ్, రాహుల్, శోభ, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే పూజలు

నర్సాపూర్ రూరల్: మండలంలోని నారాయణపూర్ గ్రామంలో హజ్రత్ సయ్యద్ లాల్ షక్వద్రి ఉర్ఫ్ మౌలానాబాబా దర్గా వద్ద ఆదివారం ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ నయిముద్దీన్, సర్పంచ్ మహమ్మద్ ఇస్రాత్ ఫాతిమా, బీఆర్‌ఎస్ నాయకులు అశోక్‌గౌడ్, నాయకులు భిక్షపతి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



## పచ్చదనం.. ఆహ్లాదం

మిరుదొడ్డి మండలంలో ఆరుతడి సాగు జోరుగా సాగుతోంది. పుడమి పొత్తిళ్లలో పడిన పత్తి విత్తనం పురుడు పోసుకుంది. పచ్చదనం వెల్ల విరిసి ప్రకృతికే వన్నె తెస్తోంది. నేలమ్మకు పచ్చని రంగేసినట్టు ఉట్టి పడుతుండడం అందరిని ఆకట్టుకుంటుంది. - మిరుదొడ్డి(దుబ్బాక)



## బెడ్డు నిర్మించి.. పరికరాలు మరిచి

మిరుదొడ్డిలోని బొమ్మ రాజు చెరువు కట్టపై గతంలో రూ. 5 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. బెడ్డు నిర్మించి పరికరాలు బిగించడం పూర్తిగా మరిచారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. - మిరుదొడ్డి(దుబ్బాక)



## నిధులు ఫుల్.. పనులు నిల్

దుబ్బాక మండలంలోని బల్వంతాపూర్ నుంచి చింత మడకకు వెళ్లే రోడ్డులో ఉన్న బ్రిడ్జి నిర్మాణానికి రూ. 2 కోట్ల 50 లక్షల నిధుల మంజూరయ్యాయి. నిధులు మంజూరై ఏడాది గడుస్తున్నా టెండర్ కాకపోవడంతో పనులు ప్రారంభించలేదు. - దుబ్బాకరూరల్

# ఇదేమి దారిద్రం

- తండాలకు తారురోడ్లు కరువు
- వానాకాలం వస్తే నరకయాతనే..
- ఇబ్బంది పడుతున్న గిరిజనులు

అక్కన్నపేట(హుస్నాబాద్): తండాలకు కనీస రోడ్డు సౌకర్యం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వానాకాలం వచ్చిందంటే నరకయాతన అనుభవిస్తున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో మండలంలోని మైసమ్మవాగుతండా గ్రామ పరిధిలోని మల్బుకుంటతండా, రంగన్నకుంట, దుబ్బ తండా గ్రామ పరిధిలో దాస్‌తండా వయా వంకాయతండా, పంచరాయితండా, గండిపల్లి గ్రామ పరిధిలోని అంబనాయక్‌తండా, పంచరాయితండా, ధాక్యనాయక్ తండా, మంజ్యానాయక్‌తండా, చాపగానితండా గ్రామపరిధిలోని ఫన్యానాయక్‌తండా, ఇప్పలతండా, పెరమండ్లాతండా, మసిరెడ్డితండా గ్రామ పరిధిలోని పిట్టలతండా, పంతుల్‌తండా గ్రామ పరిధిలోని దుబ్బతండా, చెరుకొమ్ముతండా వరకు తారురోడ్డు నిర్మాణానికి దాదాపు రూ. 19.58 కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీంతో 2023 అక్టోబర్ 4వ తేదీన అప్పటి గిరిజన, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తారురోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కానీ సుమారు 4 నెలలు కావొస్తున్నా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. దీంతో గిరిజన తండాల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనులు సాగేనా... లేక ప్రభుత్వం మారిందన్న సాకుతో రద్దు చేస్తారేమో అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

**ఏళ్లుగా ఎదురుచూపులే..**

గత ప్రభుత్వం తండాలను గ్రామ పంచాయితీలుగా మార్చిందే కాని అందుకు అవసరమైన అభివృద్ధిని మరిచిపోయిందని గిరిజనులు విమర్శిస్తున్నారు. రోడ్లు, మౌలిక వసతులు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తండాలకు తారురోడ్లు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని వేడుకుంటున్నారు. ఇదే విషయమై గిరిజన సంక్షేమ శాఖ ఏఈ సురేందర్‌రెడ్డిని వివరణ కోరగా తారురోడ్ల నిర్మాణానికి టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు బిల్లులు రావాల్సి రావాలని.. అవి రాగానే పనులు చేపడతామని చెబుతున్నాడని పేర్కొన్నారు. త్వరలో పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



అధ్వానంగా గిరిజన తండాల రోడ్లు



గత ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్మాణానికి వేసిన శిలాఫలకాలు (ఫైల్)

# టీహెచ్‌ఆర్ ట్రోఫీ విజేత ముండ్రాయి

నంగునూరు(సిద్దిపేట): మండల కేంద్రం నంగునూరులో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు క్రికెట్ ట్రోఫీని ముండ్రాయి జట్టు గెలుచుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ముండ్రాయి జట్టు 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 103 పరుగులు చేయగా ఎస్‌సీసీ నంగునూరు జట్టు 7 వికెట్లు నష్టపోయి 64 పరుగులు చేసింది. 42 పరుగులు చేసిన సాయిచరణ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహిపాల్‌రెడ్డికి మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అందజేశారు. ఈసందర్భంగా ఆయిల్‌ఫామ్ ఫార్మర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి మాట్లాడుతూ.. పోటీలో గెలుపు, ఓటములు సహజమన్నారు. పోటీలో గెలుపొందిన విజేతలకు హరీశ్‌రావు చేతుల మీదుగా ట్రోఫీలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

# 28న జలతంత్రి పుస్తకావిష్కరణ



ఆహ్వానపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

సిద్దిపేటకమాన్: ప్రముఖ కవి, రచయిత తైదల అంజయ్య కవితా సంపుటి జలతంత్రి పుస్తకావిష్కరణ సభ ఈనెల 28న సిద్దిపేటలో జరుగుతుందని మంజీరా రచయితల సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆదివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా మంజీరా రచయితల సంఘం అధ్యక్షుడు రంగాచారి, ప్రధాన కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ.. సభకు ప్రఖ్యాత కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, సరస్వతీ సమ్మాన్ అవార్డు గ్రహీత శివారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్, కవి, రచయిత నందిని సిదారెడ్డి, రచయిత దేశపతి శ్రీనివాస్, విరాహత్ అలీ, దేవీప్రసాద్ హాజరవుతారని చెప్పారు. సాహిత్య సభకు సాహితీ ప్రియులు, మరసం మిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పుస్తక రచయిత తైదల అంజయ్య, మరసం ప్రతినిధులు రాజిరెడ్డి, తోట అశోక్, సాధత్ అలీ, శ్రీనివాస్, రాములు, సర్దార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన జీపీ భవనం ప్రారంభం



నూతన భవనం ఎదుట ప్రజాప్రతినిధులు, నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని మర్రిముచ్చాలలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని సర్పంచ్ పద్మ, ఎంపీపీ తలారి కీర్తనతో కలసి ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా స్థల దాతలను సన్మానించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి కరుణాకర్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## మాంసం, మద్యం షాపులు బంద్ చేయాలి



మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

హుస్నాబాద్: అయోధ్య బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం పట్టణంలోని మద్యం, మాంసం దుకాణదారులు స్వచ్ఛందంగా బంద్ చేసి దేశ సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవించాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మద్యం విక్రయదారులు సాయంత్రం 6 గంటల వరకు తమ దుకాణాలు బంద్ చేసి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం నాయకులు చొక్కాచారి, అనంతస్వామి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వేడుకలకు వేళాయే..



హుస్నాబాద్: రామాలయాన్ని పూలతో అలంకరిస్తున్న భక్తులు



ఆలయంలో సీతారామచంద్ర స్వామి

హుస్నాబాద్: అయోధ్య రామ జన్మభూమి శ్రీ రాముల వారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా పట్టణంలోని సీతారామ చంద్రస్వామి ఆలయంలో సోమవారం కార్యక్రమాన్ని వీక్షించడానికి ఎల్‌ఈడీ ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు భక్తులచే వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

**మార్మోగిన జై శ్రీరామ్ నినాదాలు**

గజ్వేల్‌రూరల్: అయోధ్యలో భవ్య రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా గజ్వేల్ పట్టణంలో రామభక్తులు, హైందవులు ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని మురళీకృష్ణాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా మీదుగా అంగడిపేట హనుమాన్ దేవాలయం నుంచి కోటమైసమ్మ వరకు, తిరిగి అక్కడి నుంచి మురళీకృష్ణాలయం వరకు చేపట్టారు.

**దేవాలయాల్లో ఏర్పాట్లు**

నంగునూరు(సిద్దిపేట): మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా గ్రామాల్లోని హనుమాన్ దేవాలయాలను శుద్ధి చేసి ఉత్సవాలకు సిద్ధం చేశారు. కొండంరాజ్‌పల్లిలో ఇంటింటా స్వామి వారి అక్షింతలను పంపిణీ చేశారు.



గజ్వేల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు



సిద్దిపేటలో జెండాలతో స్థానికులు



నంగునూరు: కొండంరాజ్‌పల్లిలో అక్షింతల పంపిణీ

# అసత్య ఆరోపణలు సరికాదు

చేర్యాల(సిద్దిపేట): అవిశ్వాసం విషయంలో పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేసిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, వైస్‌చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. అవిశ్వాసం విషయంలో బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లు పార్టీ నిర్ణయానికి పనిచేశారే తప్ప ఎవరిని మోసం చెయలేదన్నారు. కొందరు కౌన్సిలర్లు పార్టీకి వెన్నుపోటు పొడిచే ప్రయత్నంచేయగా గమనించిన ఇద్దరు కౌన్సిలర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా పనిచేశారన్నారు. నామినేటెడ్ పదవులు ఆశ చూపి కాంగ్రెస్ పార్టీ చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులు దక్కించుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. దాన్ని పసిగట్టిన ఎమ్మెల్యే పార్టీ నిర్ణయాన్ని దాటి పోవద్దని, భవిష్యత్ ఉంటుందని ఇచ్చిన భరోసా మేరకు ఇద్దరు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసం వీగిపోయే దిశగా పనిచేశారని తెలిపారు. ఆమె వెంట కౌన్సిలర్లు చంటి, సతీష్, నాయకులు యాదగిరి, శ్రీధర్ రెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపరాణి

### 28న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

సిద్దిపేటకమాన్: తెలంగాణ బ్రాహ్మణ సేవా సంస్థ, సిద్దిపేట బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 28న స్థానిక శివానుభవ మండపంలో వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ అధ్యక్షుడు బల్వంతరావు తెలిపారు. ఆదివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వివాహం కోసం ఎదురు చూసే వధూవరులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### ఉచిత వైద్య శిబిరానికి స్పందన

సిద్దిపేటజోన్: సిద్దిపేట పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మార్కండేయ దేవాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు సంపత్ కుమార్, శ్రీ లక్ష్మి, మమతారెడ్డి ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలి సమాజం అధ్యక్షుడు రాజేశం, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, కోశాధికారి శ్రీనివాస్, ప్రతినిధులు అశోక్, శ్రీహరి, రవితేజ, ప్రసాద్ పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ నిరుపేదకు ఆప్తమిత్ర ఆపన్నహస్తం**



జగదేవ్‌పూర్(గజ్వేల్): నిరుపేద కుటుంబానికి ఆప్తమిత్ర బృందం గజ్వేల్ వారు చేయూతను అందించారు. నిర్మల్ జిల్లాకు చెందిన నరేష్ దంపతులు జగదేవ్‌పూర్ మండలంలోని వట్టిపల్లికి వలస వచ్చి బతుకున్నారు. ఇటీవల నరేష్ మృతి చెందడంతో భార్య సంధ్య ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. విషయం తెలుసుకున్న ఆప్తమిత్ర బృందం గజ్వేల్ వారు ఆదివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. 50 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందించారు. అలాగే పెద్ద కూతురు పేరు మీద రూ. 25 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మల్లిఖార్జున్, నరేందర్, జగదీష్, గిరిబాబు, సాయికిరణ్, రాజు, రాజేశ్వర్‌రెడ్డి, అశోక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

**◆ నూతన నియామకం**

హుస్నాబాద్: పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో ఆదివారం పట్టణ ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా తణుకు ఆంజనేయులు, బెజగం శ్రీనివాస్ వ్యవహరించారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా చొల్లేటి శంకరయ్య, అధ్యక్షుడిగా కొత్త శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గౌరిశెట్టి రాజు, కోశాధికారిగా బబ్బుల రవీందర్‌తో పాటు మహిళా, యువజన విభాగాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**◆ రజక సంఘం కమిటీ ఎన్నిక**

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల రజక సంఘం కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడుగా తరిగొప్పుల కనకయ్య, ఉపాధ్యక్షులుగా రాజయ్య, కార్యదర్శిగా సదయ్యతో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండలాధ్యక్షుడు కనకయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**◆ ప్లేట్లు, గ్లాసుల వితరణ**

బెజ్జంకి(సిద్దిపేట): అయోధ్య రామాలయంలో బాలరాముని ప్రతిష్ఠ వేడుకల సందర్భంగా బెజ్జంకిలో నిర్వహిస్తున్న వేడుకల్లో అన్నదానం కోసం శివసేనా యూత్ సభ్యులు ఆదివారం 2,500 ప్లేట్లు, 5 వేల గ్లాసులను వితరణ చేశారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సతీష్, సహాయ కార్యదర్శి చంద్రం, రాకేష్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే బెజ్జంకి, మండలంలోని నర్సింహులపల్లెలో కాషాయ జెండాలను పంపిణీ చేశారు.

# కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకుడు ప్రసాద్

సిద్దిపేటకమాన్: కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు శోభన్ నాయక్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి అన్నారు. ఆదివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మిక కర్షక మైత్రి జిల్లా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 26న అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్, వాహనాల ర్యాలీ నిర్వహించాలన్నారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రంగారెడ్డి, కనకయ్య, శ్రీనివాస్, రవీందర్, బాల్‌నర్సయ్య, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.